www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 04 | జూలై | 2026
పేజీలు : 8

## నకిలీ నెంబర్ ప్లేట్లతో ఆంధ్రా టు తెలంగాణ ఇసుక రవాణా



-మూడు లారీలు, ఎస్కార్ట్ కారు సీజ్
-నలుగురు అరెస్ట్.. ఒకరు పరార్

6లో

# గ్రామీణ ప్రజలకు కనీస వసతుల కల్పనే ధ్యేయం



- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా
- ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు
- రూ. 2.93 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/పాల్వంచ : శాశనసభ ఎన్నికలలో నన్ను నమ్మి అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నియోజక వర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నామని ఎంఎల్ఏ కూనంనేని సాంబ శివరావు అన్నారు. మండల పరిధి రేగులగూడెం, చంద్రాలగూడెం,

మిగతా 2లో..

# మూగబోయిన అరుణ గానం

-అరుణోదయ నాగన్న మృతి





-వామపక్ష నేతల నివాళి

ప్రజాపక్షం/ఖమ్మం : జీవిత కాలం ప్రజా చైతన్యానికి కృషి చేసిన ఓ గానం అమరత్వాన్ని సంతరించుకున్నది. అరుణోదయ నాగన్నగా కీర్తి నొందిన నాగయ్య (68) శుక్రవారం మృతిచెందారు. ఆయన గత కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. పరకాల నాగయ్య ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాజారాం గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించారు. చైతన్యానికి మారుపేరైనా రాజారాం గ్రామంలో తన తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన పాటలు పాడుతూ వ్యవసాయ కూలీగా తన జీవితాన్ని ప్రారంభించాడు. సిపిఐ మార్క్సిస్టు, లెనినిస్ట్ పార్టీలో రాష్ట్ర స్థాయి నాయకునిగా ఉండి రాజారాం గ్రామానికే చెందిన మద్ది వెంకట రెడ్డి సహచర్యంలో ఎర్ర జెండా వైపు ఆకర్షితుడయ్యాడు. శ్రీపాద శ్రీహరి, పెద్దినేని చలపతిరావు, వెంకటేశ్వరరావు, పెద్ద చంద్రన్న తదితరుల నేతృత్వంలో గొప్ప కళాకారునిగా ఎదిగాడు. నాగన్న ఎమర్జెన్సీ తర్వాత మార్క్సిస్టు, లెనినిస్ట్ భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ గ్రామ గ్రామాన సభలు, సమావేశాల్లో పాల్గొన్నారు. అరుణోదయ నాగన్న పాట వినడానికే బహిరంగ సభలకు జనం వచ్చే వారంటే అతిశయోక్తి కాదు. ఎమర్జెన్సీలో హత్య గావించబడిన పోట్ల రామనర్సయ్య పేరుతో వచ్చిన అమరుడు మన రామనర్సయ్య అనే పాటలు నాగన్న పాడుతుంటే విన్న వారి కండ్లు చేమర్చేవి. తన పాటలతో రౌద్రాన్ని రగిలించగలిగిన

మిగతా 2లో..

- చీకటిపడితే రెక్కలు విప్పుతున్న రేషన్ బియ్యం దందా.?
- తక్కువ ధరకు కొని.. ఎక్కువ ధర రూ. 20 కి విక్రయం
- అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు..?



# రేషన్ దందా.. ఆపే దమ్ముందా..?



ప్రజాపక్షం/జూలూరుపాడు : రేషన్ దందాను ఆపే దమ్మేవరికుందని రెచ్చిపోతున్నారు రేషన్ దందా అక్రమార్కులు. పేదల కడుపు నింపేందుకు ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం అక్రమార్కులకు వరంగా మారింది. సన్న బియ్యం పంపిణీతో అక్రమ రవాణా సద్దుమణుగుతుందనుకున్న దందా అర్ధరాత్రుల్లో

మిగతా 2లో..

# ఎండిపోతున్న గోదావరి తీరం..!



- సూపర్ ఎల్‌నినో గుప్పెట్లో గోదావరి తీరం
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- అడ్డగోలు ఇసుక తవ్వకాలతో ముంచుకొస్తున్న ముప్పు
- సీతమ్మసార్ డీసిల్టింగ్ పేరిట సాగుతున్న దోపిడీ
- మేలుకోక పోతే భవిష్యత్ శూన్యం

ప్రజాపక్షం/చర్ల : సూపర్ ఎల్‌నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు, అత్యల్ప వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో చర్ల మండల రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. దేశవ్యాప్తంగా వాతావరణాన్ని శాశిస్తున్న సూపర్ ఎల్‌నినో ముప్పు ఒకవైపు మునంచుకొస్తుంటే మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా సీతమ్మసాగర్ ప్రాజెడు డిసిల్టింగ్ పేరిట చర్ల మండలంలో ఇసుక ర్యాంపులకు అనుమతులు ఇస్తుంది. దీని ప్రభావం చర్ల మండలంలోని భూగర్భ జలాలు ప్రమాదస్థాయిలో అడుగంటి పోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి నది ప్రక్కనే ప్రవహిస్తున్నప్పటికీ రాబోయే రోజుల్లో చర్ల మండలంలో సాగు, తాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సిన

మిగతా 2లో..

# గ్రామీణ ప్రజలకు కనీస వసతుల కల్పనే ధ్యేయం

(మొదటిపేజీ తరువాయి)

బంజెర, మల్లారం, మందరెకలపాడు తదితర గ్రామాలలో శుక్రవారం పలు గ్రాంట్ల ద్వారా విడుదలైన రూ. 2. 93 కోట్ల విలువైన పలు అంతర్గత రహదారులు, బిటి రోడ్స్ రెన్యువల్ లాంటి పలు అభివృద్ధి పనుల శంఖుస్థాపనులు, పంచాయితీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. దీనిలో రేగులగూడెం నుండి మామిడిగూడెం వరకు లక్ష్మీదేవిపల్లి నుండి మల్లారం వరకు బిటి రోడ్ రెన్యువల్ నిర్మాణ పనులకు 1. 40 లక్షలు కేటాయించారు. అనంతరం ఎంఎల్ఏ కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం నియోజక వర్గంలో గ్రామీణ ప్రధాన రహదార్ల నిర్మాణాలు ఇప్పటికే తుది దశకు చేరుకొన్నాయని తెలిపారు. అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, బిటి రెన్యూవల్స్ పనులు సైతం ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడుతూ నిధులను వెచ్చిస్తున్నామని స్పష్టం చేశారు.నియోజక వర్గ సమగ్రాభివృద్ధి కట్టుబడి ఉన్నానని అన్నారు. తనను నమ్మి గెలిపించిన ప్రజాల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి ఆకాంక్షల మేరకు నియోజక వర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నామని ధీమా వ్యక్తం వ్యక్తం చేశారు. కేటిపిఎస్



విస్తరణ, పాల్వంచ స్థలాల క్రమబద్దీకరణ, విమానాశ్రయం, ఓఆర్ రోడ్లు, పరిశ్రమల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. వాటిని సాధించి ప్రజలకు బహుమతిగా ఇచ్చే వరకు విశ్రమించబోనని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే. సాబీర్ పాషా, కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, నయిమ్ ఖురేషి, కాంగ్రెస్ నాయకులు ఎర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, తహశీల్దార్ దారా ప్రసాద్, పంచాయితీరాజ్ డిఈ రాజశేఖర్, సిపిఐ నాయకులు కార్పోరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, వైఎస్ గిరి, వేములపల్లి శ్రీనివాసరావు, ఆలపాటి ప్రసాద్, దారా శ్రీను,చిల్ల క్రిష్ణ, సమ్మయ్య, వెంకటముత్యం, వాసు, అమృతరావు, చర్ప రాజేష్, సర్పంచులు, ఉప సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎండిపోతున్న గోదావరి తీరం..!

(మొదటిపేజీ తరువాయి)

దుస్థితి దాపురించనుంది. ప్రకృతి విపత్తులకు మావన తప్పిదాలు తోడు కావడంతో ఈ ఖరీఫ్ సీజన్లో వరి సాగు చేసే రైతాంగం తీవ్ర ఆందోళనలో మునిగిపోయింది. ప్రస్తుత సంవత్సరం వర్షా కాలంపై సూపర్ ఎన్‌నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. జూన్ మాసం ముగిసిపోయి జూల్ ప్రారంభమైనప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు లేవు. ఈ నెల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కానున్నట్లు ఇటీవల వాతావరణ శాఖ హెచ్చరించింది. గోదావరి నదిలో ప్రవాహాలు తగ్గడం, వర్షాలు లేకపోవడంతో చర్ల మండలంలోని బోరు బావుల్లోను నీటి మట్టాలు రోజురోజుకీ పడిపోతున్నాయి. గతంలో ఎప్పుడూ లేనివిధంగా భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో మోటార్లు కూడా పనిచేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### వరి సాగుపై నీలినీడలు...

మండలంలో ఖరీఫ్ సీజన్ వస్తే చాలు వరి నాట్లతో కలకల్లాడే పంట పొలాలు నేడు వర్షాలు లేక నీల్లు లేకపోవడంతో వెలవెలబోతున్నాయి. వరిసాగుకు నీటి లభ్యత అత్యంత కీలకం, కానీ ప్రస్తుతం పరిస్థితులు పడిపోతున్న నీటి మట్టం వలన నాట్లు వేయడం ఇప్పటికే ఆలస్యమైంది. మోటార్లపై ఆధారపడి సాగుచేద్దామన్నా భూమిలో నీరులేదు. వ్యవసాయ శాఖ అధికారులు సైతం దీర్ఘకాలిక వరి రకాల కంటే తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపాలని సూచిస్తుండటం ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడుతోంది. సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో పట్టుకుని జిల్లా కలెక్టర్ రైతు సంక్షేమంపై దృష్టిపెట్టి భూ గర్భ నిల్వలు పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# మూగబోయిన అరుణ గానం




(మొదటిపేజీ తరువాయి)

నాగన్న ఉమ్మడి రాష్ట్రంలో చిరపరిచితులు. పాటలు పాడటమే గాక ఆయా సందర్భాలను బట్టి పాటలు కూడా రచించిన నాగన్న నేటి తరాలకు స్ఫూర్తిదాత. అంతేకాదు నాగన్న పలు సినిమాల్లో విప్లవ గీతాలు ఆలపించి కీర్తి గడించారు. కళను అమ్ముకుంటున్న నేటి రోజుల్లో ఎర్ర జెండా పాట తప్ప అద్దెకు తన గొంతు ఇవ్వని అరుణోదయం నాగన్న ఆర్థిక పరిస్థితులు చుట్టుముట్టిన కాలువ వెంట ప్రభుత్వ స్థలంలో చిన్న నివాసాన్ని ఏర్పాటు చేసుకుని జీవించారు తప్ప ఎవరి వద్ద చేయి చాచని గొప్ప వ్యక్తిత్వం నాగన్నది. బుర్రకథ కళాకారునిగా మొత్తం తెలంగాణలోనూ గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లోనూ ప్రదర్శనలు ఇచ్చారు. నాగన్న మరణించిన ఆయన గానం చిరస్థాయిగా నిలిచిపోతుంది. నాగన్న కుమారుడు అజయ్ కూడా తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ ప్రజా కళాకారునిగా గుర్తింపు పొందగా నాగన్న సతీమణి సైతం కళాకారిణిగా, నాయకురాలిగా ప్రజా ఉద్యమాల్లో పాల్గొంది.



### నాగన్న మృతిపట్ల పలువురి సంతాపం :

అరుణోదయ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన నాగన్న మృతి పట్ల పలువురు సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ఆ పార్టీ నాయకులు నాగన్న మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ప్రజా నాట్య మండలి కళాకారులు, అరుణోదయ కళాకారులు, వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు.

### సిపిఐ నేతల నివాళి :

ప్రజా గాయకుడు అరుణోదయ నాగన్న మృతికి సిపిఐ నేతలు నివాళులర్పించారు. రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఉంచిన నాగన్న భౌతికాయాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. నాయకులు శింగు నర్సింహారావు, బిజి క్లైమెంట్, తాటి వెంకటేశ్వరరావు, చింతల రమేష్, దోసపాటి సృజన, శంకర్‌రావు, శ్రావణ్, మధు, పోటు పూర్ణ తదితరులు నివాళులర్పించారు.

# మున్సిపాలిటీ కార్మికుల తొలగింపు

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని మున్సిపాలిటీ కార్మికులు 60 సంవత్సరాలు పైబడిన వారిని తొలగించేందుకు హైదరాబాద్ సిడిఎంఏ కార్యాలయం నుంచి ఆదేశాలు అందినట్లు కమిషనర్ జి సాయి కృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ మేరకు కార్మికులకు నోటీసు బోర్డు ద్వారా అందించడంతోపాటు వారికి తెలియపరచినట్లు తెలిపారు. మున్సిపాలిటీ కార్మికులందరూ ఆధార్ కార్డు, రేషన్ కార్డు ,ఓటర్ ఐడి కార్డు ,ఉద్యోగ తీర్మాన పత్రం లను సమర్పించాలని,15వ తేదీ నుండి 60 సంవత్సరాలు పైబడిన వారిని వారి సేవలను ఆపివేస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. మరియు వారి కుటుంబంలో కుమార్తె, కుమారుడు, వారసులు ఉన్నట్లయితే వారి బదులు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిబంధన ప్రకారము నోటీసులు అందించడం జరిగిందని ఆ నోటీసులు ప్రకారం గమనించి సహకరించాలని కమీషనర్ వివరించారు.


# కల్లూరులో రింగ్ రోడ్డు విస్తరణ పనులు

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని ఎన్ఎస్పి లో రింగ్ రోడ్డు విస్తరణ పనులు రూ. ఆరు కోట్ల నిధులతో ప్రారంభించినట్లు జాతీయ రహదారుల అధికారులు తెలిపారు. రింగ్ రోడ్డు చుట్టూ కల్లూరు టు సత్తుపల్లి కల్లూరు టు తిరువూరు, కల్లూరు టూ ఖమ్మం వైపు రింగ్ రోడ్డు వద్ద నుండి మూడు వైపులా కూడా డ్రైనేజీ తో పాటు రోడ్డు విస్తరణ పనులు



నాలుగు నెలల్లో పూర్తికానున్నట్లు అధికారులు వివరించారు. జాతీయ రహదారిపై ఎలాంటి ప్రమాదాలు ఇబ్బందులు లేకుండా వాహనదారులకు సౌకర్యంగా ఉంటుందని, దీంతో ఎన్ఎస్పి రింగ్ రోడ్లో ప్రమాదాల నివారణకు, అతివేగం నివారణ, ట్రాఫిక్ నియంత్రణ కు ఈ ప్రణాళికలు జరిగినట్లు అధికారులు సూచిస్తున్నారు. మరో నాలుగు నెలల్లో త్వరితగతిన ఈ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురానున్నట్లు ఎన్ హెచ్ అధికారులు పేర్కొన్నారు,

# జిల్లా మలేరియా అధికారిగా కె వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** ఖమ్మం జిల్లా మలేరియా అధికారిగా కె వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఖమ్మం పట్టణ మలేరియా పథకంలో సీనియర్ కీటక శాస్త్ర నిపుణుడిగా విధులు నిర్వహించారు. అంతకుముందు హన్మకొండ జిల్లాలో జపనీస్ మెదడువాపు, వాహక వ్యాధుల నియంత్రణ విభాగంలో సీనియర్ కీటక శాస్త్ర నిపుణుడిగా పనిచేసి ప్రజారోగ్య రంగంలో విశేష అనుభవాన్ని సంపాదించారు. అనంతరం ఖమ్మంలో సీనియర్ ఎంటమాలజిస్టుగా సేవలందిస్తూ నేడు మలేరియా అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రామారావు మలేరియా జిల్లా అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కె వెంకటేశ్వర్లును అభినందించారు. జిల్లాలో మలేరియా, డెంగ్యూ తదితర దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణ, నియంత్రణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలుచేయాలని, ప్రజల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, సంబంధిత సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ జిల్లాను వ్యాధి రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు.

# రేషన్ దందా.. ఆపే దమ్ముందా..?

(మొదటిపేజీ తరువాయి) మళ్లీ జడలు విప్పుతోంది. సన్న బియ్యం నాణ్యత లేకుండా ఉన్నాయని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో తినేందుకంటే, అమ్ముకునేందుకే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. దీంతో అక్రమార్కుల చీకటి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా మారింది. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా ఈ బియ్యం అక్రమ రవాణాలో పాత్రదారులు మారడంలేదు. అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో అక్రమార్కులు మండలాలను, పంచుకుని అధికార్లకు, నాయకులకు ముడుపులు సెటిల్ చేస్తున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### చీకటి పడితే రెక్కలు విప్పుతున్న రేషన్ దందా..

జూలూరుపాడు మండలంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నదనేది బహిరంగ రహస్యంగా మారింది. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ప్రజల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో బియ్యం నిల్వలు పెట్టుకొని ఆటోలు, మినీ వ్యాన్‌లు, బొలేరో వాహనాల్లో నింపి, చంద్రుగొండ సుజాతనగర్, ఇతర ప్రాంతాలకు తరలిస్తూ అక్రమార్జన చేస్తున్నట్లు సమాచారం. రేషన్ బియ్యం అక్రమ దందాపై పోలీస్, రెవెన్యూ, పౌరసరఫరా అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లుగా వదిలేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేద, మధ్య తరగతి వర్గాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార భద్రత కార్డులు జారీ చేసి వారికి ఆసరాగా ఉండేందుకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నది. పేదల ఆకలి తీర్చాలనే ఆశయంతో పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. సివిల్ సైప్లె శాఖలో చర్యలు తీసుకుంటున్నా రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోలేకపోతున్నదని పలువురు భావిస్తున్నారు.

### ఈ పాస్, బయోమెట్రిక్ విధానం వచ్చినా ఫలితం శూన్యం..

రేషన్ దందాను అరికట్టడానికి రేషన్ దుకాణాల్లో ఈ పాస్, బయోమెట్రిక్ విధానం అమల్లోకి వచ్చినా ఫలితం లేకుండా పోతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రేషన్ దందాను అరికట్టాల్సిన సంబంధిత అధికారులు మొక్కుబడి దాడులు చేస్తున్నారే తప్ప నిర్ధిష్టమైన చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని రేషన్ బియ్యం కొందరు దళారుల చేతుల్లో రేషన్ బియ్యం దందా రెక్కలు విప్పుతుందనేది బహిరంగ రహస్యమేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనప్పటికీ రేషన్ బియ్యం అక్రమ దందాను జూలూరుపాడు, చుట్టు పక్కల మండలంలో సంబంధిత అధికారులు కట్టడి చేయడంలో విఫలమవుతున్నారనే ఆరోపణల్లో నిజం లేకపోలేదు. అధికారులకు ప్రత్యేక దృష్టి సారించి రేషన్ బియ్యం దందాను కొందరు దళారులు కింగ్ లా రాజ్యమేలుతున్న తతంగం పట్ల ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు భావిస్తున్నారు.

### అధికారుల పాత్ర పై అనుమానం..

రేషన్ దందా వెనుక అధికారుల పాత్ర లేకుండా జరగం అసాధ్యమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రేషన్ బియ్యం మిల్లులకు చేరడం అక్కడ నుంచి మార్కెట్ లోకి తిరిగి రావడం వెనుక పెద్ద నెట్ వర్క్ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతి నెలా ముడుపులు అందుకుంటున్నందునే అధికారులు మీన మేషాలు లెక్కిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం పేదలకు చౌక ధరలో నాణ్యమైన బియ్యం ఇవ్వాలని లక్ష్యంగా పెటుకుంది కానీ కొందరు అధికారులు ముడుపులకు ఆశపడటం వల్ల ప్రభుత్వానికి అపకీర్తి మూటకట్టుకుంది. అదే కాకుండా పేద కుటుంబాలు బయట మార్కెట్ లో ఎక్కువ రేటుకు బియ్యం కొనాల్చి వస్తుంది. ఇప్పటికే సంబందిత శాఖా అధికారులు స్పందించి రేషన్ బియ్యం అక్రమ రవాణా కు అడ్డు కట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

# ఇండో ఖతర్ ప్రాజెక్టు అక్రమాలపై రెరా కన్నెర..

## -విలేకరుల సమావేశంలో ఆర్‌టిఐ సామాన్య కార్యకర్త రాము




**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్:** నిబంధనలను ఇండో ఖతార్ యాజమాన్యం తుంగలో తొగిందని ఆర్‌టిఐ సామాన్య కారకర్త రాము ఆరోపించారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సొంత ఇంటి కలను ఆసరా చేసుకొని ఆక్రమాలకు పాల్పడుతున్న రియల్ ఎస్టేట్ వెంచర్లపై అధికారులు కొరడా జూలిపించారని ఖమ్మం ప్రజలను అడుగడున మోసం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిబంధనలను ఉల్లంఘనలకు పాల్పడిన ఇండో ఖతార్ యాజమాన్యానికి రియల్ ఎస్టేట్ రెగ్యులేటర్ ఆథారిటీ(రెరా) భారీ జారీమానా విధించదని ఇండో ఖతార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మస్థలి, క్షేత్ర 1, క్షేత్ర2, ధరణి, ప్రణామం వంటి రియల్ ఎస్టేట్ వెంచర్లు రెరా నిబంధనలు పాటించలేదని గుర్తించరన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా యంత్రాగం స్పందించి ఇండోఖతార్ ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సామాన్య ప్రజలు ఇండోఖతార్ యాజమాన్య మార్కెటింగ్ మోసాల భారీన పడవద్దని ఆయన కోరారు.

# పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ పథకం విద్యాభివృద్ధా? రాజకీయ వేదికా?

**- తెలంగాణలో చర్చనీయాంశంగా మారిన కేంద్ర విద్యాపథకం**




**ప్రజాపక్షం/తల్లాడ:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ పథకం రాష్ట్రంలో విద్యారంగంతోపాటు రాజకీయ వర్గాల్లోనూ చర్చకు దారితీస్తోంది. ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించడం, విద్యర్థులకు నాణ్యమైన విద్య అందించడం లక్ష్యంగా ప్రారంభమైన ఈ పథకం అమలుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ2020) అమలుకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దడమే పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ పథకం ప్రధాన ఉద్దేశం. ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలలకు కేంద్రప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తూ ఆధునిక మౌలిక వసతులు కల్పిస్తోంది. స్మార్ట్ క్లాస్‌రూమ్స్, డిజిటల్ బోధన, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, క్రీడామైదానాలు, పరిశుభ్రమైన తాగునీరు, మరుగుదొడ్లు, హరిత వాతావరణం వంటి సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నారు. ఉపాధ్యాయులకు ఆధునిక బోధనా పద్దతులపై శిక్షణ కూడా అందిస్తున్నారు. ఈ చర్యలతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు సమానమైన అవకాశాలు లభిస్తాయని కేంద్రప్రభుత్వం చెబుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఈ పథకం అమలుపై రాజకీయ విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. కొన్ని పాఠశాలలను మాత్రమే ఎంపిక చేయడం వల్ల మిగిలిన ప్రభుత్వ పాఠశాలలు వెనుకపడే అవకాశం ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఎంపిక కాని పాఠశాలలకు కూడా సమానస్థాయిలో నిధులు కేటాయించాలని, పలువురు కోరుతున్నారు. మౌలికవసతులతోపాటు బోధన నాణ్యత, ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ, విద్యార్థుల అభ్యాస ఫలితాలపై కూడా సమాన దృష్టి అవసరమని సూచిస్తున్నారు. రాజకీయంగా కూడా ఈ పథకం చర్చకు దారితీసింది. కేంధ్రప్రభుత్వం దీనని విద్యాసంస్కరణల్లో కీలక అడుగుగా ప్రచారం చేస్తుండగా, ప్రతిపక్ష పార్టీలు ఇది రాజకీయ ప్రచార వేదికగా మారుతోందని విమర్శిస్తున్నారు. తెలంగాణలో పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ పథకం అమలుకు సంబంధించి నిధులు వినయోగం, పాఠశాలల ఎంపికలో పారదర్శకత ఉండాలని, పలువురు డిమాండ్ చేస్తున్నారు. కొన్ని ఆరోపణలపై న్యాయస్థానంలో విచారణ కూడా కొనసాగుతోంది. అయితే ఆ ఆరోపణలు ఇంకా నిర్ధారణ కాలేదని గుర్తుచేయాల్సిన అవసరం ఉంది. విద్యానిపుణుల అభిప్రాయం ప్రకారం ఏ ప్రభుత్వ పథకమైనా రాజకీయాలకు అతీతంగా విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అమలు చేయాలి. ఎంపికైన పాఠశాలలతోపాటు ఇతర ప్రభుత్వ పాఠశాలలను కూడా దశల వారీగా అభివృద్ధి చేస్తేనే సమగ్ర విద్యాభివృద్ధి సాధ్యమవుతుందని వారు సూచిస్తున్నారు. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచడం, ఆధునిక విద్యా వాతావరణాన్ని కల్పించడం వంటి లక్ష్యాలు పూర్తిస్థాయిలో నెరవేరితే పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ పథకం తెలంగాణ విద్యారంగంలో ముఖ్యమైన మైలురాయిగా నిలిచే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# పండుగలా వనమహోత్సవం

**మొక్కలు నాటిన ఎమ్మెల్యే దంపతులు**








**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలో ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన వన మహోత్సవ కార్యక్రమం పండుగలా జరిగింది. రాష్ట్రంలోనే మొట్టమొదటి సారి ఆశా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, సంస్థ పౌండర్, రాష్ట్ర నాయకుడు దయానంద్ విజయ్ కుమార్ పర్యవేక్షణలో సుమారు 15 వేల మందితో భారీ వనమహోత్సవ ర్యాలీ వైభవంగా సాగింది. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమం సత్తుపల్లి పట్టణ చరిత్రలోనే అతిపెద్ద పర్యావరణ ర్యాలీలలో ఒకటిగా నిలిచింది. జేవీఆర్ కాలేజ్ గ్రౌండ్‌లో ప్రారంభమైన కార్యక్రమానికి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి, జిల్లా కలెక్టర్ దివాకర్ ముఖ్య అతిథులుగా హాజరై వనమహోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం జేవీఆర్ కాలేజ్ నుంచి పాత సెంటర్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన వేలాది మంది విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు, యువత, ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతు ప్రకటించారు. ర్యాలీలో జానపద కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులతో కలిసి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ర్యాలీలో పాల్గొని వారితో మమేకమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ మాట్లాడుతూ ఇంత భారీ స్థాయిలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని, తాను ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలతో నిర్వహించిన పర్యావరణ కార్యక్రమంలో పాల్గొనడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ, సత్తుపల్లి నియోజకవర్గం విద్య, అభివృద్ధి, సామాజిక చైతన్యంలో ముందంజలో ఉందని, ఈ భారీ వనమహోత్సవ ర్యాలీ రాష్ట్ర చరిత్రలో ప్రత్యేక గుర్తింపును పొందుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ రిహానా కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, వార్డ్ కౌన్సిలర్లు, ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నర్సింహరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# రూ.25కోట్లు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ

**- మండల వ్యవసాయ అధికారి నారెడ్డి సీతారామరెడ్డి**




**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రైతు భరోసా నిధులు తిరుమలాయపాలెం మండలంలో 25వేలమంది రైతులకు సాగులో ఉన్న భూములకు ఎకరాకు రూ.6వేలు చొప్పున ఐదు ఎకరాల లోపు రైతులకు సుమారు రూ.22కోట్ల రైతు భరోసా నిధులు విడతలవారీగా జమ అవుతున్నాయని మండల వ్యవసాయ అధికారి నారెడ్డి సీతారామరెడ్డి తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కి రైతులు పెట్టుబడి భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం రైతు భరోసా నిధులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోందని మండల పరిధిలోని రైతులంతా ప్రభుత్వం అందించిన రైతు భరోసా నిధులను వ్యవసాయానికి సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుతం రైతులు పంట మార్పిడి సాగునీరు తక్కువ వినియోగించే పంటలను ఎంచుకోవాలని సూచించారు. రసాయనిక ఎరువులు తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడాలని నానో యూరియా నానో డీఏపీ రైతులు వాడకం అలమరుచుకోవాలని సూచించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతిలో రైతులు పంటలు సాగు చేయాలని, మేలైన విత్తనాలు ఎంచుకుని సరైన సమయానికి విత్తనాలు ఎత్తుకోవడం సరైన సస్యరక్షణ చర్యలు తీసుకుని పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి సాధించి, పెట్టుబడి భారాన్ని తగ్గించుకోవచ్చన్నారు. రైతులంతా రైతు భరోసా నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# విబిజీ రాంజీ చట్టాన్ని రద్దు చేయాలి



**ప్రజాపక్షం/బోనకల్:** కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విబిజీ రాంజీ (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) చట్టాన్ని రద్దు చేసి, ప్రసుత్తం అమలులో ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ సిహెచ్ సుధాకర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధీ హామీ చట్టం గ్రామీణ పేదలు, వ్యవసాయ కూలీల జీవనోపాధికి భరోసాగా నిలుస్తోందని తెలిపారు. ఈ చట్టాన్ని బలహీనపరిచే లేదా రద్దు చేసే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, గ్రామీణ ప్రజల ప్రయోజనాలను కాపాడే విధంగా ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బంధం రాజ్యం, మండల అధ్యక్షులు తెల్లాకుల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు దేగల లక్ష్మి నారాయణ, తిరుపతిరావు, పురుషోత్తం, కొమ్మినేని సీతారాములు, బాజా వీరభద్రం, గద్దల సుందర్రావు, భూషమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఉచితంగా రైతులకు పత్తి విత్తనాల పంపిణీ



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిధిలోని రాఘవాపురంలో జాతీయ ఆహార భద్రత పథకం కింద రైతులకు శుక్రవారం మండల వ్యవసాయ అధికారిణి సరిత ఉచితంగా పత్తి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఈ పథకం ద్వారా రైతులకు ఉచిత పత్తివిత్తనాల పంపిణీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధిక సాంధ్రత(హైడెన్సిటీ) పద్ధతిలో పత్తి సాగు చేపట్టడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడిని సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వాసంతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండలంలోని వెంకటాపురం గ్రామంలో శుక్రవారం బహుజన సమాజ్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కత్తుల ఉపేందర్‌కు ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాన్ని గ్రామ బీఎల్ఓలు బంక నాగరాజు, బంక ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతీ అర్హత కలిగిన ఓటరుకు ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారం అందేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఫారాలను ఓటర్లు సక్రమంగా పూరించి ఈనెల 24వ తేదీలోపు గ్రామపంచాయతీ కార్యాలయంలో సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ బీఎల్ఓలు, స్థానికులు పాల్గొన్నారు.

# రోడ్డుకు మరమ్మతులు తక్షణమే చేపట్టాలి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఉప్పలచెలక పార్థసారధిపురం గ్రామాల మధ్య ఉన్న రైల్వే అండర్ పాస్ రహదారిని డ్రైనేజ్ ఏర్పాటు చేయకుండా అసంపూర్తిగా వదిలి వేయడంతో రహదారిపై గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిల్వ ఉండటం వలన ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం పెనుబల్లి మండల కమిటీ బృందం శుక్రవారం రైల్వే అండర్ పాస్ రోడ్డును సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు గాయం తిరుపతిరావు మాట్లాడుతూ మాట్లాడుతూ కొత్తగూడెం నుండి సత్తుపల్లి కి బొగ్గు రవాణా కోసం రైల్వే లైన్ ఏర్పాటు చేయగా ఉప్పల చిలక నుండి నీలాద్రి వెళ్లే రోడ్డు మధ్యలో రైల్వే అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేశారు. అండర్ పాస్ రోడ్డును కాంట్రాక్టర్ నీళ్లు పోవడానికి డ్రైనేజ్ ఏర్పాటు చేయకుండా నిర్మాణాన్ని మధ్యలోనే ఆపివేయడం వలన వర్షం వచ్చినప్పుడు నీళ్లు ఎటు వెళ్లకుండా రోడ్డు మధ్యలోనే ఆగిపోవడం వలన ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రహదారిపై ప్రతిరోజు విద్యార్థులు, రైతులు, కార్మికులు, మరియు నీలాద్రి గుడికి వెళ్లే వారు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడం వలన ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి అండర్ పాస్ రోడ్డును మరమ్మతులు చేపట్టి, వర్షపు నీరు నిల్వ లేకుండా డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గాయం తిరుపతిరావు, చిమట విశ్వనాథం, వెంకటేశ్వరరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

# బిఎల్‌వోలు బాధ్యతాయుతంగా పనిచేయాలి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** బిఎల్‌వోలు బాధ్యతాయుతంగా పనిచేసి సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఎల్ఎంటిలు, ఏఈఆర్‌వోలు తెలిపారు. సర్ కార్యక్రమంపై శుక్రవారం ఖమ్మం నగరంలో బిఎల్‌వోలకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఓటరు వివరాలను ఖచ్చితంగా సేకరించి పరిశీలించిన అనంతరం ఖచ్చితంగా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. శిక్షణ సందర్భంగా బిఎల్‌వోలు క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న పనితీరును పరిశీలిస్తూ ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలను నమోదు చేస్తున్నారా, సమాచారాన్ని యాప్‌లో సక్రమంగా నమోదు చేస్తున్నారా అనే అంశాలను పరిశీలించారు. ప్రతి ఓటరుకు సంబంధించిన వివరాలు ఖచ్చితంగా నమోదు కావడంతో పాటు మ్యాపింగ్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిఎల్‌వోలకు సూచించారు.

## ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

**-ఖమ్మం అడిషనల్ కలెక్టర్ శ్రీజ**



**ప్రజాపక్షం/ఏన్కూరు:** గ్రామంలో ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతల నిర్మాణం త్వరగా చేపట్టాలని ఖమ్మం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీజ తెలిపారు. మండల పరిధిలోని భగవాన్ నాయక్ తండ గ్రామంలో శుక్రవారం ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంటల నిర్మాణాన్ని ప్రతి ఒక్కరు నిర్మించుకోవాలని కోరారు. పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. భూగర్భ జలాలను పెంచేందుకు పంట పొలాల్లో పంట కుంటలను నిర్మించేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో వైరా ఏడిఏ కరుణ శ్రీ, ఏవో నరసింహారావు, ఎంపీఓ జేవీఎస్ నారాయణ, గ్రామ పంచాయితీ సర్పంచ్ మణి, పంచాయితీ కార్యదర్శి మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించిన ఆర్‌జెడి



**ప్రజాపక్షం/ఏన్కూరు:** ఏన్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కొత్తగా మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఆర్‌జెడి మదన్ మోహన్ శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాల పరిసరాలను, పాఠశాలకు కావలసిన కొత్త వసతులను పరిశీలించారు. పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు, కిలోమీటర్ లోపు ఎన్ని పాఠశాలలు ఉన్నాయి, కళాశాలలు ఎన్ని ఉన్నాయని అధికారులను అడిగారు. అదే విధంగా తరగతి గదులు మొత్తం ఎన్ని ఉన్నాయని, ఉపయోగంలో ఉన్న తరగతి గదులు ఎన్ని, శిథిలావస్థలో ఉన్నవి ఎన్ని అని సమగ్రంగా విచారణ చేశారు. కొత్తగా ఎన్ని తరగతి గదులు అవసరం ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి పూర్తి సాయి నివేదికను పంపనున్నట్లు ఆయన తెలిపారు. నివేదిక ఆధారంగా దశలవారీగా పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ బుగ్గయ్య, ఎంఈవో వాసవి దేవి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వన మహోత్సవం



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలంలోని జూలూరుపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని పాపకొల్లు ప్రధాన రహదారి రోడ్డుకు ఇరువైపులా శుక్రవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, గ్రామస్థులు కలిసి ఏవిన్యూ మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ, హరిత వాతావరణ విస్తరణ, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతి సంపదను అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. రహదారుల వెంట మొక్కలు నాటడం ద్వారా పచ్చదనం పెంపొందడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ తాళ్లూరు రవి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని కోరారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని బతికించే దిశగా ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రామారావు, ఈసీ సైదులు, టీఏ నాగమణి, ఉపాధి హామీ పథకం సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్‌కి సన్మానం



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా వరుసగా మూడో సారి నియమితులైన సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ని శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగబండి వెంకటేశ్వర్లు , తాటిగూడెం ఉపసర్పంచ్ గాంధర్ల రామనాథం, మండల నాయకులు దుర్గం కన్నయ్య, జాడి లక్ష్మీ నారాయణ , రామటెంకి దామోదర్ లు ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి, స్వీట్లు తినిపించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తూ, ప్రజలకు సేవలందిస్తున్న సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ కి వరుసగా మూడోసారి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం ఆయనపై పార్టీ నాయకత్వానికి ఉన్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. తమ అభిమాన నాయకులు, పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నాయకత్వంలో, సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో కరకగూడెం మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షిస్తూ, పార్టీ కార్యక్రమాల్లో తమ సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన తాటి

**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేట మండలం పార్కలగండి గ్రామంలో జరిగిన చెన్నారావు, నందిని వివాహ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో అశ్వారావుపేట మాజీ ఎంఎల్‌ఏ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వారికి నూతన వస్త్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో సోయం వీరభద్రం, మాజీ సర్పంచ్ సాగర్, తాటి సాయి, స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు ప్రక్షాళనలా..? పౌరసత్వ పరీక్షలా..?

**- 2002 లింకుతో ఓటర్లలో తీవ్ర గందరగోళం**
**అర్హులైన పేదలు, వలస జీవుల ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం..!**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ క్షేత్రస్థాయిలో తీవ్ర వివాదాలకు, ఆందోళనలకు దారితీస్తోంది. ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడం, నకిలీ ఓట్లను తొలగించడం మంచిదే అయినప్పటికీ, దాని కోసం అనుసరిస్తున్న నిబంధనలు సామాన్య పౌరులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ముఖ్యంగా ఈ ప్రక్రియను 2002 నాటి ఓటరు డేటాతో ముడిపెట్టడం, కొత్తగా ఎన్యూమరేషన్ ఫారాలతో పాటు పౌరసత్వ ఆధారాలు చూపాలనడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దశాబ్దాలుగా నివాసాలు మారిన వలస జీవులకు, నిరక్షరాస్యులైన పేదలకు ఇది పెద్ద శాపంగా మారింది. కుటుంబ సభ్యుల పాత రికార్డులు లేకపోతే అర్హులైన ఓటర్లకు ఇడుపు కాగితం (తొలగింపు నోటీసు) తప్పదా..? అనే భయాందోళనలు నేలకొండపల్లి మండల పరిధిలో నెలకొన్నాయి.

### ఎన్ఆర్సీ తరహా కు?.. విపక్షాల ధ్వజం

గతంలో ఎన్నడూ లేని విధంగా ఓటరు గుర్తింపు కోసం కఠిన నిబంధనలు పెట్టడం పరోక్షంగా జాతీయ పౌరసత్వ రిజిస్టర్ (ఎన్ఆర్సి) అమల్లో భాగమేనని విమర్శకులు ఆరోపిస్తున్నారు. బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలే లక్ష్యంగా, తమకు ప్రతికూలంగా ఉన్న ఓట్లను తొలగించేందుకే ఈ సర్ అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారని కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు మండిపడుతున్నాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా 23 ప్రతిపక్ష పార్టీలు ఈ అంశంపై భారత ప్రధాన న్యాయమూర్తికి బహిరంగ లేఖలు రాయడం దీని తీవ్రతకు అద్దం పడుతోంది.

### క్షేత్రస్థాయిలో భాషా సమస్యలు

అస్పష్ట విధానాలు మరోవైపు బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓ) అవగాహన కల్పించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఫారాలు కూడా స్థానిక భాషల్లో కాకుండా కేవలం ఆంగ్లంలోనే ఇవ్వడం వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెవిటి, మూగ వంటి దివ్యాంగులు, తల్లిదండ్రుల వివరాలు లేని అనాథలు ఓట్ల పరిస్థితి ఏమిటన్నదానిపై స్పష్టత కరువైంది.

### ఎన్నికల సంఘం రాజకీయ క్రీడలో బందీ కాకూడదు

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, ప్రజాహితంగా ఉండాలి. ఎలాంటి గందరగోళానికి తావివ్వకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కాపాడాలి. కేంద్ర ప్రభుత్వ రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికల సంఘం తన స్వయంప్రతిపత్తిని పణంగా పెట్టకూడదు.

### నకిలీ ఓట్ల పేరుతో అర్హుల ఓటు హక్కుకు భంగం కలగకూడదు పసుమర్తి శ్రీనివాస్ రావు సామాజిక కార్యకర్త



ఓటర్ల జాబితాను పారదర్శకంగా, తప్పులులేకుండా రూపొందించడం ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధమైన బాధ్యత. ఈ క్రమంలో నకిలీ ఓట్లు, డూప్లికేట్ నమోదులను తొలగించడం అవసరమే అయినప్పటికీ, ఆ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా అత్యంత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# వాట్సాప్ గ్రూపుల్లో వ్యాపారం..!

**- ప్రజాపక్షం కథనంతో**
**రియల్ ఉపాధ్యాయుల గుండెలో గుబులు**
**- రియల్ లీలలపై నివేదిక సేకరించిన నిఘా వర్గాలు**
**- తీవ్ర చర్చనీయాంశంగా మారిన కథనం**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలో రియల్ వ్యాపారులుగా అవతారం ఎత్తిన కొందరు ఉపాధ్యాయులపై ప్రజాపక్షం ప్రచురించిన కథనం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సదరు రియల్ ఉపాధ్యాయులు నివాసిత ప్రాంతాలలో ఏ ఒక్కరిని కదిలించినవారే కదా? అనే పేరు వినిపించింది. అవును వారు పాఠశాల కంటే కూడా రియల్ వ్యాపారంపైనే ఎక్కువ మక్కువ చూపిస్తుంటారంటు వ్యాఖ్యనిస్తున్నారు. అలాగే ఈ వ్యాపారం మొత్తం వాట్సప్‌గ్రూపుల్లో జరుగుతుంటుందని, పాఠశాలలో ఉన్నవాటిన ఆపిరేట్ చేస్తుంటారని, ఆ గ్రూపులలో ఉండే వారే పేర్కొంటున్నారంటే అతిశయోక్తి కాదు.

### గుండెలో గుబులు...

ఇప్పటివరకు యథేచ్చగా వెంచర్లలో ప్లాట్ల విక్రయాలు కొనుగోలుదారులతో మంతనాలు నిర్మాణ రంగానికి సంబంధించిన వ్యవహారాల్లో చురుకుగా కనిపించిన వారు ఒక్కసారిగా మాట మార్చారు. తమకు రియల్ వ్యాపారంతో ఎలాంటి సంబంధం లేదని సన్నిహితుల ద్వారా చెప్పుకుంటున్నట్లు తెలిసింది. కేవలం బంధువులు ప్లాట్లు , మిత్రుల నిర్మాణాలకే తమ పేర్లు వినిపించాయని తాము కేవలం పరిచయాలు మాత్రమే కల్పించామని చెబుతుండటం గమనార్హం. అయితే సదరు రియల్ ఉపాధ్యాయుల పరిస్థితిపై స్థానికులు సమాచారంతో పాటు ప్రజాపక్షం పరిశీలనలో ముదిగొండ మండలంలో పనిచేస్తున్న ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని నివాసం ఉంటున్న ఇద్దరు ఉపాధ్యాయులతో పాటు నేలకొండపల్లి తిరుమలాయపాలెం, ఖమ్మంరూరల్ మండలాలకు చెందిన మరికొందరు ఉపాధ్యాయుల పేర్లు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి. అలాగే ఖమ్మంనగరంలో ఓ మహిళా కళాశాలలో పని చేసి ఇప్పుడు పక్క జిల్లాలో ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తునే నిత్యం ఇదే పనిలో మునిగితేలుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా రియల్ రంగంలో ఏజెంట్లు స్వయంగా ప్రజాపక్షాన్ని సంప్రదించి కథనంలో ప్రస్తావించిన అంశాలపై మరిన్ని వివరాలు సైతం అందిస్తున్న పరిస్థితి ఉంది.

### తీవ్ర చర్చనీయాంశంగా కథనం...

ప్రజాపక్షం కథనం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏకంగా వాట్సప్‌గ్రూపులలో కొందరు ఉపాధ్యాయులు కథనాన్ని షేర్ చేయడం విశేషం. అంతేకాకుండా ఇప్పటికి సదరు రియల్ వ్యాపారులు బాగోతం బైటపడబోతుందంటూ సన్నిహితులతో చర్చించినట్లు తెలిసింది. అంతేకాకుండా సంబంధిత కథనంపై సామాన్యులు సైతం వాట్సప్ గ్రూపుల్లో స్పందించారు. ఇన్సురెన్స్ ఏజెంట్లుగా సైతం అవతరం ఎత్తినట్లు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఉదాంతపై ఆరా తీసినట్లు తెలిసింది. రియల్ ఉపాధ్యాయుల లీలలు కొనసాగుతున్నాయని గుర్తించినట్లు సమాచారం. ఈ క్రమంలో నివేదికను సైతం రూపొందించినట్లు సమాచారం. ఇప్పటికైన దీనిపై ఉన్నతస్థాయి అధికారులు పరిశీలన చేయకపోతే ఈ ఆగడాలు ఆగేలా కనిపించడం లేదు.

## ఎస్కార్ట్ క్రేన్‌ను ప్రారంభించిన జీఎం




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణి సత్తుపల్లి ఏరియాలోని జేవీఆర్ ఓసీ ప్రాజెక్టుకు రూ.22.69 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన 12 టన్నుల సామర్థ్యం గల ఎస్కార్ట్ క్రేన్‌ను శుక్రవారం సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. జేవీఆర్ ఓసీ లైట్ మోటార్ వెహికల్ (ఎల్ఎంవీ) సెక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన క్రేన్‌ను ప్రారంభించి వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జీఎం చింతల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధునిక యంత్ర పరికరాల వినియోగంతో నిర్వహణ పనులు మరింత వేగవంతం కావడంతో పాటు భద్రతా ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. కొత్త క్రేన్ అందుబాటులోకి రావడం వల్ల వాహనాల మరమ్మతులు, భారీ పరికరాల నిర్వహణ పనులు సమర్థవంతంగా చేపట్టేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవీఆర్ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్.వి.ఆర్. ప్రహ్లాద్, ఎస్వో టు జీఎం బొల్లం శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ కె. సోమశేఖర్ రావు, ప్రాజెక్ట్ ఇంజనీర్ డి. శ్రీనివాసరావు, ఎస్వోఎం బి. రాజేశ్వరరావు, మేనేజర్ (ఆపరేషన్స్) జి. కళ్యాణ్ రామ్, సేఫ్టీ ఆఫీసర్ ఎస్. గోవింద్, ఎస్ఈ (ఈ అండ్ ఎం) ముక్కా శ్రీను, డిప్యూటీ ఇంజనీర్ (ఈ అండ్ ఎం) పి. గోపి, కాలరీ ఇంజనీర్ జగదీశ్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎస్. సుధాకర్, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ బి. కోటేశ్వరరావు, కాంత్రికుమార్, సంక్షేమ అధికారులు దారా కావ్య, కె. శ్రీనివాస్‌తో పాటు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# వామ్మో వల్లాపురం వెళుతున్నారా.. జర భద్రం..!

**-రోడ్లను కమ్మేసిన చెట్లు.. తారు పోయి కంకర తేలిన రోడ్డు**
**-మరమ్మతులకు నోచుకోని వైనం**
**-ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు**







**ప్రజాపక్షం/వైరా:** ఆ గ్రామానికి వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడాల్సిందే. ప్రమాదాలకు గురికావాల్సిందే. ఇది వైరా మండలంలోని ఓ గ్రామానికి వెళ్లే రోడ్ల పరిస్థితి. వైరా మండలం వల్లాపురం గ్రామానికి పాలడుగు నుండి వల్లాపురం వెళ్లాలి అంటే ఆ ప్రాంత ప్రజలు పలుర కాల ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అస్తవ్యస్తంగా గుంటలమయంగా మారి రోడ్లపై కంకర రాళ్ళు తేలి దర్శనమిస్తున్నాయి. వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదానికి గురికావాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత కొన్ని రోజులుగా వల్లాపురం గ్రామ ప్రజలు రోడ్డు సమస్యలపై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యలు చెప్పిన పట్టించుకున్న నాధుడే లేడు. రోడ్డుకి ఇరువైపులా కంప పెరిగి చూడటానికి భయాందోళన పరిస్థితిని కల్పించే విధంగా ఉన్నాయి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరిగిందో అని ఆందోళన చెందాల్సిన పరిస్థితి. గ్రామ ప్రజలు రోడ్లకు ఇరువైపులా దట్టంగా పెరిగిన ముళ్ళకంపలు, మూలవైపుల వద్ద ఎదురుగా వాహనాలు కనిపించక ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. ఎందుకు ఇంత నిర్లక్ష్యం ఎందుకంత బాధ్యతారహితంగా అధికార యంత్రాంగం ఉంది. పాలడుగు నుండి వల్లాపురం పోవాలి అంటే ఆ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కసారి అధికారులు మానవత్వంతో ఆ రోడ్లను పరిశీలించి రోడ్డును కమ్మేసిన ఇరుపక్కల ముళ్ళకంప రోడ్లపై గుంటలు చూస్తే అర్థమవుతుంది. ఎంతోమంది విద్యార్థులు విద్యను అభ్యసించడానికి పలు ప్రాంతాలకు ఈ గ్రామం నుండి వెళుతూ ఉంటారు. సైకిల్ మీద వెళితే విద్యార్థులకు సైతం రోడ్లపై ఇబ్బందులు తప్పని పరిస్థితి. వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులకు తప్పని తిప్పలు. జరా ఒక్కసారి ఆలోచించండి సారూ వల్లాపురంపై నిర్లక్ష్య ధోరణి వీడి రోడ్లను మరమ్మత్తులు చేపట్టి రోడ్లకు ఇరుపక్కల ఉన్న కంపచెట్లను తొలగించాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# సింగరేణిని రాజకీయ వేదికగా మార్చొద్దు

**- తప్పు జరిగితే ప్రశ్నించడమే మా విధానం**
**-కూనంనేని వ్యాఖ్యను ఉద్దేశ్య పూర్వకంగా వక్రీకరిస్తున్నారు**
**- కార్మిక చెమట చుక్కలను స్వప్రయోజనాలకు వాడకండి**
**- గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి సంస్థను రాజకీయ వేదికగా వినియోగించుకోవడం మానుకోవాలని, కార్మికుల చెమటచుక్కలను స్వప్రయోజనాలకు వాడుకోవద్దని సింగరేణి కాలరీక్ వర్కర్క్ యూనియన్ (ఏఐటియూసి) గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన 'ప్రజాపక్షం'తో మాట్లాడుతూ కార్మికుల చెమట చుక్కలను రాజకీయ స్వప్రయోజనాల కోసం వాడుకోవద్దని హితవుపలికారు. బొగ్గు ఉత్పత్తి గణాంకాలపై చర్చించాలనుకుంటే సరైన వేదిక శాసనసభే అని, గనుల వద్ద మీడియా సమావేశాలు నిర్వహించడం ద్వారా సింగరేణి ప్రతిష్ట దెబ్బతింటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా బొగ్గు ఉత్పత్రి గణాంకాలపై తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తిన విషయాన్ని ఆయన గుర్తుచేస్తూ అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా తప్పు జరిగితే ప్రశ్నించడమే తమ విధానమని స్పష్టం చేశారు. రాజకీయ అవసరాలకు అనుగుణంగా సింగరేణిని వివాదాల్లోకి లాగడం సరైంది కాదని, సంస్థ ప్రతిష్టకు భంగం వాటిల్లే చర్యలను ఏఐటియూసి ఎప్పటికీ వ్యతిరేకిస్తూనే ఉంటుందని తెలిపారు. సింగరేణి కాలరీస్ వర్కర్క్ యూనియన్ (ఏఐటియూసి) గౌరవ అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివ రావు చేసిన వాస్తవపు వ్యాఖ్యలను ఉద్దేశ్యపూర్వకంగా వక్రీకరించారని రాజ్‌కుమార్ ఆరోపించారు. బొగ్గు చోరీకి గురికాలేదని మాత్రమే కాకుండా తప్పుడు ఉత్పత్తి లెక్కలు చూపించడం కూడా ఉప్పేనని ఆయన స్పష్టంగా చెప్పారని వివరించారు. కార్మికులు అయోమయానికి గురికాకూడదనే ఉదేశ్యంతోనే ఆ వ్యాఖ్యలు చేశారని చెప్పారు. రాబోయే సింగరేణి సంస్థ గుర్తింపు సంఘం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సంస్థను రాజకీయ ప్రచారానికి వాడుకోవడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. గనులపై, అధికారులపై అనవసరపు ఒత్తిడి తేవడం వల్ల కార్మికుల్లో అభద్రతా భావం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణిని రాజకీయాలకు అతీతంగా ఉంచడం, కార్మికుల హక్కులను పరిరక్షించడం, సంస్థ ప్రతిష్టను కాపాడం, భవిష్యత్‌ను సురక్షితం చేయడమే సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) లక్ష్యమని చెప్పుకొచ్చారు. ఈ విషయంలో కార్మికులంతా ఐఖ్యంగా ఉండాలని కొరిమి రాజ్ కుమార్ పిలుపునిచ్చారు.

# పాదర్శకతలేని సామాజిక తనిఖీలు

**-అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల అసంతృప్తి**
**-తనిఖీల్లో ప్రజల భాగస్వామ్యానికి తావు లేదనే విమర్శలు**
**-పూర్తి వివరాలు వెల్లడించకుండా**
**నివేదికలు రూపొందిస్తున్నారనే ఆరోపణలు**



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండలంలో జరుగుతున్న సామాజిక తనిఖీ(సోషల్ ఆడిట్)ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులకు పూర్తి సమాచారం ఇవ్వకుండా, వారి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోకుండానే తనిఖీలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సామాజిక తనిఖీ ఉద్దేశం ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడం కాగా, క్షేత్రస్థాయిలో మాత్రం ఆ లక్ష్యం నెరవేరడం లేదని పలువురు పేర్కొంటున్నారు. పనులకు సంబంధించిన పూర్తి వివరాలు, ఖర్చుల సమాచారం, లబ్దిదారుల వివరాలను ప్రజల ముందు ఉంచకుండా సామాజిక తనిఖీ చేయడానికి వచ్చిన సిఆర్పిలును సంబంధిత ఉద్యోగులు అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారని పొంతన లేని నివేదికలు సిద్ధం చేస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అలాగే గ్రామసభల్లో ప్రజలకు మాట్లాడే అవకాశం కల్పించడం లేదని, అభ్యంతరాలను నమోదు చేసినా వాటిని పరిగణనలోకి తీసుకోవడం లేదని గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. దీంతో సామాజిక తనిఖీ ప్రక్రియ విశ్వసనీయతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశాలపై ఈనెల ఆరవ తేదీన జరగబోయే బహిరంగ సామాజిక తనిఖీలకు సంబంధించిన గ్రామసభలో మండలంలోని ప్రజలు ప్రజాప్రతినిధులు అందరు పెద్ద సంఖ్యలో పాల్గొని జరుగుతున్న అక్రమాలపై చర్చించి విషయాలను తెలుసుకోవాలని సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి సామాజిక తనిఖీని పూర్తి స్థాయి పారదర్శకతతో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## విద్యార్థుల వివరాలు యాప్‌లో నమోదు చేయాలి



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండలంలోని అన్ని విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయుల సమావేశం మండల విద్యావనరుల కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి ఉండేటి ఆనంద్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో జరుగుతున్న మార్పులపై సమీక్ష చేశారు. విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు, మధ్యాహ్న భోజన వివరాలను సంబంధిత యాప్‌లో ప్రతి రోజు ఉదయం 10గంటల లోపు తప్పని సరిగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. అలాగే ఉపాధ్యాయుల హాజరు నమోదు సక్రమంగా చేయాలని, సెలవు వివరాలను ముందుగానే యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, నిలకడ శాతం పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని తెలిపారు. ఈసారి బైస్‌లైన్ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచడంతో పాటు నాణ్యమైన విద్య అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పాఠశాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో కాంప్లెక్స్ ఇంచార్జ్ ఆంగోతు వెంకటేశ్వర్లు, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీసీఓలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

## కేజీబీవీలో ఆరోగ్య శిబిరం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రాము ఆధ్వర్యంలో శుక్రవారం సమగ్ర ఆరోగ్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి, రక్తహీనత, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం హాస్టల్‌లోని భోజన వసతులు, వంటశాల పరిశుభ్రత, ఆహార నాణ్యత, తాగునీటి సౌకర్యాలను పరిశీలించిన డాక్టర్ రాము, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా పోషకాహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. బాలికల ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం కీలకమని పేర్కొన్నారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ వి కవిత మాట్లాడుతూ ఇలాంటి ఆరోగ్య శిబిరాలు విద్యార్థినుల ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి నివారించేందుకు దోహదపడతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్ఓ)హరికృష్ణ, హెల్త్ సూపర్వైజర్ పూర్ణరావు, స్టాఫ్ నర్సులు భాగ్యలక్ష్మి, రాధా, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, హాస్టల్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## తంబర్ల రవికి ఘన సన్మానం



**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేటలో తెలంగాణ మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేము సైతం ఫౌండేషన్ ఛైర్మన్ తంబళ్ల రవికి ఘన సన్మానం శుక్రవారం నిర్వహించారు. సమాజ సేవలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి యూనియన్ ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. సేవా కార్యక్రమాల్లో తంబళ్ల రవి చూపుతున్న చొరవ ప్రశంసనీయమని ఈసందర్భంగా నిర్వాహకులు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో తెలంగాణ మోటార్ వర్కర్స్ యూనియన్ సభ్యులు, మహిళా మండలి నాయకురాలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ ఉద్యమ నేతలారా కదలి రండి



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** ఆదివాసీల రాజ్యాంగ హక్కులు, సంస్కృతి పరిరక్షణ కోసం ఐక్యంగా ముందుకు రావాలని ఆదివాసీల ఐక్య కార్యచరణ వేదిక పిలుపునిచ్చింది. శుక్రవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు భద్రాచలంలోని ఐటిడిఏ గిరిజన భవన్‌లో జాతీయ ఆదివాసీ రాజ్యాంగ హక్కులు, సంసకృతి పరిరక్షణ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. చందా లింగయ్య దొర ఆధ్వర్యంలో దేశం నలుమూలల నుంచి ప్రముఖ ఆదివాసీ నాయకులు, మేధావులు హాజరుకానున్న ఈ సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జాతి ఐక్యత కోసం, హక్కుల పరిరక్షణ కోసం దేశ వ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. ఈ నేపథ్యంలో సదస్సుకు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని వేదిక గౌరవ అధ్యక్షులు కొమురం దామోదరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కుంజా శ్రీనివాస్‌రావు, మహిళా నాయకురాలు కొమురం ఫణీశ్వరి విజ్ఞప్తి చేశారు.

## బొడ్రాయి శంకుస్థాపన



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు మండలంలోని సుభాష్‌నగర్ గ్రామ పంచాయితీ పరిధిలో ముక్తేశ్వర ముత్యాలమ్మ తల్లి, శ్రీ లక్ష్మి భూలక్ష్మి సమేత నాభిశిల బొడ్రాయి శంకుస్థాపన కార్యక్రమంలో ఇల్లందు ఎంఎల్ఏ కోరం కనకయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అభివృద్ధితో పాటు గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఎంఎల్ఏ ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్, సుభాష్‌నగర్ సర్పంచ్ వల్లాల మంగమ్మ, నరసయ్య, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రతి అర్హుడు ఓటరు జాబితాలో ఉండాలి

**-సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**
**-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో ఉండేలా బిఎల్‌వోలు, బిఎల్‌ఏలు కృషి చేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఖమ్మం నగరంలో పలు ప్రాంతాల్లో బిఎల్‌వోలు చేపట్టిన ఎన్యూమరేషన్ ప్రక్రియను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పరిశీలించారు.ఈ సందర్భంగా బిఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీకి చెందిన బూత్ లెవల్ ఏజెంట్లతో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ ఫోన్ ద్వారా సమావేశంలో పాల్గొని బిఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి సమర్ధవంతంగా తీసుకెళ్లాలని, అర్హులైన ప్రతి ఓటరుకు సహాయం అందించాలని, పార్టీ బలోపేతానికి అంకిత భావంతో పనిచేయాలన్నారు. అనంతరం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఎదుర్కొనే వారికి సహకారం అందించాలని తెలిపారు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా అత్యంత జాగ్రత్తగా పనిచేయాలని బిఎల్ఏలకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి సరైన సమాచారాన్ని నమోదు చేయాలని, ప్రజలు కూడా ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా నింపి అవసరమైన పత్రాలతో సమయానికి సమర్పించాలన్నారు. ప్రజలకు ఏమైనా సందేహాలు ఉంటే బిఆర్ఎస్ బూత్ లెవల్ ఏజెంట్లను సంప్రదిస్తే పూర్తి సమాచారం అందిస్తారన్నారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుండాల కృష్ణ, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్ కుమార్, నాయకులు పగడాల నాగరాజు,బత్తులమురళి,మాజీకార్పొరేటర్లు,నాయకులు పాల్గొన్నారు.

**ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసిన మాజీ మంత్రి పువ్వాడ :** ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తమ కుటుంబ సభ్యుల ఎన్యూమరేషన్ ఫారాలను సంబంధిత బిఎల్‌వో షాహీన్ కమల్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాలనుతప్పనిసరిగా నింపి సంబంధిత బిఎల్‌వోలకు సమర్పించాలన్నారు.

# నకిలీ నెంబర్ ప్లేట్లతో ఆంధ్రా టు తెలంగాణ ఇసుక రవాణా

**-మూడు లారీలు, ఎస్కార్ట్ కారు సీజ్**
**-నలుగురు అరెస్ట్...ఒకరు పరార్**






**ప్రజాపక్షం/వైరా:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ హైదరాబాదకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు లారీలతో పాటు ఓ లారీకి ఎస్కార్ట్ వాహనంగా ఉన్న కారును గురువారం రాత్రి వైరా పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. ఈ అక్రమ ఇసుక వ్యాపారాన్ని నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఒకరు పరారీలో ఉన్నారు. అరెస్ట్ చేసిన నలుగురు వ్యక్తులను మధిర కోర్టులో రిమాండ్‌కు తరలించారు. ఈ అక్రమ వ్యాపారం చేస్తూ పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకు నిరంతరం అక్రమ ఇసుక లారీలకు ఎస్కార్ట్ వాహనం కార్ ఏర్పాటు చేసుకొని మారుకు నకిలీ రిజిస్ట్రేషన్ నెంబర్లు మారుస్తూ అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నారు. వారి వద్ద ఉన్న నకిలీ నెంబర్ల తయారు చేసే రేడియం స్టిక్కర్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వైరా ఎస్సై పుప్పాల రామారావు తెలిపిన వివరాలు ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు ఇసుక రీచ్ నుంచి తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు నిరంతరం ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. గురువారం సాయంత్రం వైరా ఎస్సై పుప్పాల రామారావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సోమవారం గ్రామ సమీపంలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ హైవే ఎగ్జిట్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో కొవ్వూరు నుంచి హైదరాబాద్‌కు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు లారీలను, ఎస్కార్ట్‌గా ఉన్న ఒక స్విఫ్ట్ డిజైర్ కారును పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. కారును పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. అంతేకాకుండా పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకు లారీలు, ఎస్కార్ట్‌గా ఉన్న కారు నెంబర్లను నిరంతరం మార్చేందుకు ఉపయోగించే రేడియం స్టిక్కర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న నల్గొండ జిల్లాకు చెందిన లారీ యజమానులు, నల్గొండ జిల్లాకు చెందిన లారీ యజమానులు, డ్రైవర్లు, ఇస్లావత్ భిక్షు, ముక్కుమాల యాదయ్య, దామ సైదులు, వాంకుడోత్ లింగా నాయక్, బచ్చుబోయిన యాదయ్యలపై వైరా పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో బచ్చుబోయిన యాదయ్య పరారీలో ఉండగా, మిగిలిన నలుగురిని అరెస్ట్ చేసిన మధిర కోర్టులో రిమాండ్‌కు పంపారు. ఈ సందర్భంగా ఎస్సై పుప్పాల రామారావు మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేసే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం నిఘా ఉంచుతామని స్పష్టం చేశారు. ఇసుక అక్రమ రవాణా సమాచారాన్ని ప్రజలు పోలీసులకు అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలో గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ఎస్సై పవన్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆగస్టు ఏడు వరకు ఓపెన్ యుజి, పిజి ప్రవేశాలు


**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉన్న డా॥ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ కేంద్రంలో యుజి, పిజి అడ్మిషన్లు ఆగస్టు ఏడు వరకు కొనసాగుతుందని ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లా, అధ్యయన కేంద్ర కోఆర్డినేటర్ డా॥ గుగులోత్ వీరన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిఏ, బికాం, బియస్సి కోర్సులతో పాటు యంఏ, యంకాం, యంయస్సి కోర్సులకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని ఆసక్తి గల అభ్యర్థులు మీ సేవ కేంద్రాల్లో కాని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఒక జత జిరాక్స్ పత్రాలు జత చేసి, ఒరిజినల్ ధ్రువపత్రాలతో అధ్యయన కేంద్రంలో అడ్మిషన్లు పొందాలని ఆ తర్వాత ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. అదేవిధంగా ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు, పిజి సెకండ్ సెమిస్టర్ విద్యార్థులు ఆగస్టు ఏడు లోగా ఫీజు చెల్లించాలన్నారు.

# ఘనంగా మెకానిక్‌ల దినోత్సవం




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రపంచ ద్విచక్ర వాహన మెకానిక్‌ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఖమ్మం నగర టూ వీలర్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో మెకానిక్ డే సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ బుల్లెట్ అన్వర్ షాప్ నందు వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో యూనియన్ అధ్యక్షులు వంగాల కొండలరావు పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ కష్టపడి పనిచేసే మెకానిక్‌లకు యూనియన్ తరుపున నిరంతరం అండగా ఉంటున్నామన్నారు. సభ్యత్వం కలిగిన ప్రతి మెకానిక్‌కు యూనియన్ ఎల్లప్పుడు తోడుగా ఉంటుందన్నారు. మెకానిక్ కుటుంబంలోని చదువుకున్న విద్యార్థులకు యూనియన్ తరుపున ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. ఆపదలో ఉన్న మెకానిక్ సోదరులకు యూనియన్ తరుపున ఆపన్న హస్తం అందిస్తున్నామన్నారు. ప్రభుత్వపరంగా మెకానిక్ సోదరులకు ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రచార కార్యదర్శి దుంపల నాగరాజు, జహంగీర్, షేక్ అబ్బాస్, మేడి పాండు, మెకానిక్ సోదరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలకు పాల్పడుతున్న మహిళ అరెస్ట్



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఆన్‌లైన్‌లో ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి లక్షల రూపాయలు దోచుకున్న సైబర్ నేరస్తురాలిని ఖమ్మం సైబర్‌క్రైం పోలీసులు కేరళ రాష్ట్ర త్రివేండ్రం సిటీలో అరెస్టు చేసినట్లు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. త్రివేండ్రంకు చెందిన మహిళా న్యాయవాది ఆర్యదాస్ శైలజ ఖమ్మం జిల్లాకు చెందిన ఒక ప్రైవేట్ ఉద్యోగికి వాట్సప్‌లో పరిచయం అయింది. తరచూ ఫోన్, చాటింగ్ చేస్తూ పరిచయం పెంచుకుంది. తాను కేరళ రాష్ట్రంకు చెందిన న్యాయవాదినని ఆన్‌లైన్‌లో తక్కువ పెట్టుబడులు పెడితే ఎక్కువ లాభాలు సంపాదించవచ్చని నమ్మబలికింది. అందుకు సంబంధించి ఎనమ్ ఆసెట్ మెనేజ్‌మెంటు పోర్ట్‌ఫోలి లిమిటెడ్ కంపెనిలో ట్రేడింగ్ ద్వారా పెట్టుబడులుపెట్టి లాభాలు పొందాలని చెప్పింది. ఆమె మాటలు నమ్మిన సదరు ఉద్యోగి వాట్సాప్, ట్రేడింగ్ లింకుల ద్వారా సుమారు 15 లక్షల రూపాయల వరకూ పెట్టుబడులు పెట్టాడు. కొంత కాలానికి ఆమెనుంచి ఎంతకు స్పందన రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించిన సైబర్ పోలీసులు చివరి సారిగా రెండు లక్షల రూపాయలు పంపిన బ్యాంక్ అకౌంట్ ఆధారంగా కేరళలోని త్రివేండ్రంకు చెందిన మహిళా న్యాయవాదిగా గుర్తించారు. సిపి సునీల్‌దత్ ఆదేశాల మేరకు సైబర్ డిఎస్పి ఫణీంధర్ నేతృత్వంలో బృందం త్రివేండ్రంకు చేరుకుని ఆమెను అరెస్ట్ చేశారు. సదరు నిందితురాలు ఖమ్మం జిల్లానే కాకుండా వివిధ రాష్ట్రాలలో ఇదే తరహాలో 38 క్రైం లింకుల కేసులో 3 కోట్ల రూపాయల వరకూ వసూలు చేసినట్లు గుర్తించారు. ట్రాన్సిట్ వారంట్ పై నిందితురాలు ఆర్యదాస్ శైలజను శుక్రవారం ఖమ్మం తీసుకువచ్చి స్థానిక సైబర్ క్రైం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన సైబర్ క్రైం డిఎస్‌పి సిహెచ్ఆర్‌వి ఫణీంధర్, సిఐ రవికుమార్, ఎస్సైలు రంజిత్‌కుమార్, విజయ్‌కుమార్, సైబర్ క్రైం స్టేషన్ సిబ్బందిని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అభినందించారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కృషితో మండలంలోని మామునూరు, ఎర్రుపాలెం గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి రూ.20లక్షల గ్రావెల్ రోడ్లు, రూ.34.60లక్షలుతో గ్రామంలోని అంతర్గత రోడ్ల నిర్మాణాలకు ఏఎమ్‌సీ ఛైర్మన్ బండారు నరసింహారావు, గ్రామాల సర్పంచులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి, చావా రామకృష్ణ, షేక్ ఇస్మాయిల్, కంచర్ల వెంకట నర్సయ్య, కడియం శ్రీనివాస్‌రావు, ఎన్.పురుషోత్తమరావు, ఉపసర్పంచిమారబత్తుల స్వామి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

# ప్రపంచ ద్విచక్ర వాహన మెకానిక్స్ దినోత్సవం

**ప్రజాపక్షం/ముదిగొండ :** ముదిగొండలో ఘనంగా ప్రపంచ ద్విచక్ర వాహన మెకానిక్స్ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షుడు ఎస్.కే.నఫీజ్ పతాకాన్ని ఆవిష్కరించి, ప్రారంభించారు. వాహనదారులకు ద్విచక్ర వాహన మెకానిక్స్ అందిస్తున్న సేవలు సమాజానికి ఎంతో కీలకమని కొనియాడారు. ఎండా, వాన తేడా లేకుండా ప్రజలకు సేవలు అందిస్తూ వాహనాల నిర్వహణలో మెకానిక్స్ కీలకపాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, ద్విచక్ర వాహన మెకానిక్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.

# పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలో ఉపాధ్యాయుల సర్వీస్‌పరమైన అంశాల పరిష్కారం కోసం, పాఠశాలల అభివృద్ధి కోసం రెండు రోజులపాటు పిఆర్‌టియు వైరా మండల శాఖ ఆధ్వర్యంలో క్యాంపెయినింగ్ నిర్వహించి అన్ని పాఠశాలలను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా యలమద్ది వెంకటేశ్వర్లు వైవి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల సాధనలో పిఆర్‌టియు ముందుంటుందని, ఉపాధ్యాయులందరూ అంకితభావంతో పనిచేస్తున్నారని ఉపాధ్యాయులకు రావాల్సిన న్యాయపరమైన ఆర్థిక అంశాలను ప్రభుత్వం త్వరగా మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు వైరా మండల అధ్యక్షులు వెలిశెట్టి నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి మేమిరెడ్డి గో వర్ధన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎన్.జాన్, వాలి, సురేష్, బి.పుల్లారావు, ఆర్‌వి.రామకృష్ణ, ఎ.రఘు, ఎం.రవికుమార్, ఎం.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# దేవ్ విజన్ సెంటర్ ప్రారంభం

**-ప్రారంభించిన సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**





**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండల కేంద్రంలోని భగత్‌సింగ్ సెంటర్‌లో దేవ్‌విజన్ సెంటర్ అండ్ ఆప్టికల్స్ ప్రారంభోత్సవానికి శుక్రవారం ముఖ్య అతిథిగా సిపిఐ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా పాల్గొని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో కంటి దవాఖాన పెట్టడం వలన ఇక్కడ ప్రజలు సుధూర ప్రాంతాలకు పోకుండా ఇక్కడే కంటి పరీక్షలు చేసుకుని అవసరమైన కళ్ళజోళ్ళు ఇవ్వడం వలన ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని ఆయన ఈసందర్భంగా అన్నారు. అలాగే ఇక్కడ ప్రజలు ఆర్థికంగా వెనకబడి ఉండటం వల్ల బీద ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత ఆపరేషన్లు నిర్వహించే విధంగా యాజమాన్యం దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ఆయన కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆళ్లపల్లి యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గంగమ్మ తల్లి ఆలయానికి కొబ్బరి కాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య, ప్రొప్రైటర్ కండె దేవేందర్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి వజ్జ పగడయ్య, వార్డు సభ్యులు సీత, సిపిఐ నాయకులు మలిపెద్ది లాజర్, ముక్తార్ పాషా, గుంతోజు శివ, ముస్తాక్, కందిమల్ల రాజు, నరెడ్ల బిక్షం, కసనబోయిన నరేష్, ఎల్లబోయిన ఉప్పలయ్య, రేసు సురేందర్, గోగ్గల రాజేందర్, శ్రీరామ్, హరీష్, నాతి దుర్గేష్, కుంట వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

# 27వేల ప్రభుత్వ పాఠశాలల కుదింపుపై ఉద్యమిస్తాం

**- 10న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** 27వేల ప్రభుత్వ పాఠశాలలను నాలుగు వేల క్లస్టర్ ప్రభుత్వ పాఠశాలలుగా కుందింపు చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే విమరించుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు వరక అజిత్, బుర్రవీరభద్రం, మంద నాగకృష్ణ, దుర్గం ప్రణయ్ డిమాండ్ చేశారు. జూలై 10న నిర్వహించే రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థలబంద్ సన్నాహక సమావేశం జిల్లా కేంద్రంలోని శేషగిరి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వవిద్యను నిర్వీర్యం చేస్తూ, విద్యను వ్యాపార వస్తువుగా మార్చే విధానాలను అమలు చేస్తున్నాయని మండిపడ్డారు. విద్యారంగానికి నిధుల కేటాయింపు తగ్గించడం వల్ల విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టి పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, షూల బలవంతపు అమ్మకాలు నిలిపేయాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, రాష్ట్రంలో నూతనజాతీయ విద్యావిధానాన్ని అమలుచేయబోమని అసెంబ్లీలో తీర్మాణం చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి సరిపడా నిధుల కేటాయింపులు జరగాలని, ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం, బ్రేక్‌ఫాస్ట్ అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన మౌళిక సదుపాయాలను కల్పించాలని విద్యాహక్కును పరిరక్షించుకునేందుకు జూలై 10న నిర్వహించే రాష్ట్రవ్యాప్త బంద్‌ను విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజ సంఘాలు విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పిటిఎస్‌యు కొత్తగూడెం పట్టణ నాయకులు హర్షవర్ధన్, సాగర్, నవీన్, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రేమ్‌కుమార్, దిలీప్‌కుమార్, విద్యాసాగర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు సృజన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా నిధులపై నిబంధనలు పాటించని బ్యాంక్ మేనేజర్..!

**-గతంలో గిరిజన రైతుపైనా వేధింపుల ఆరోపణలు**
**-పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్**

**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండలంలోని ఓ బ్యాంకు శాఖలో రైతులకు సంబంధించిన వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రైతు భరోసా నిధుల ఖాతాలో జమ అయిన వెంటనే పాత బకాయిల పేరుతో వాటిని వసూలు చేసేందుకు బ్యాంకు మేనేజర్ ప్రయత్నించారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం రైతుల సాగు అవసరాల కోసం అందించే రైతుబంధు సాయాన్ని ఈ విధంగా వినియోగించడం ప్రభుత్వ ఉద్దేశానికి విరుద్ధమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధిత రైతు ఈ విషయాన్ని సంబంధిత ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు బ్యాంకును సంప్రదించినట్లు సమాచారం. అనంతరం మేనేజన్ తన వైఖరిని మార్చుకొని వెనక్కి తగ్గినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఈ ఘటనతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. స్థానిక రైతుల కథనం ప్రకారం గతంలో కూడా ఇదే మేనేజర్ ఓ గిరిజన రైతుతో అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలు వచ్చాయని, అప్పట్లో కూడా వివాదం నెలకొన్నట్లు చెబుతున్నారు. ఇలాంటి ఆరోపణలు పునరావృతమవుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు పూర్తి స్థాయి విచారణ చేపట్టి వాస్తవాలను వెలికి తీయాలని రైతు సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందించే నిధులను ఎలాంటి పరిస్థితుల్లో బ్యాంకులు సర్దుబాటు చేయవచ్చు..?ఎప్పుడు చేయకూడదు ?అనే అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. రైతుల హక్కులకు భంగం కలగకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై బ్యాంకు యాజమాన్యం, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాలని రైతులు కోరుతున్నారు. అలాగే బాధిత రైతు ఫిర్యాదు, బ్యాంకు వివరణ, సంబంధిత అధికారుల నివేదిక ఆధారంగా నిష్పక్షపాత విచారణ నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది..

**బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు గిరిబాబు**




**ప్రజాపక్షం/జూలూరుపాడు:** భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ నాయకులు లకావత్ గిరిబాబు పిలుపునిచ్చారు. జూలూరుపాడు మండలంలోని పాపకొల్లు గ్రామ పంచాయతీలో శుక్రవారం కొనసాగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లు, పార్టీ ప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. 'సర్' ప్రక్రియకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను ప్రతి అర్హుడికీ అందజేసి, వాటిని సక్రమంగా నింపేలా అవగాహన కల్పించాలని బీఆర్ఎస్ బూత్ లెవల్ ఏజెంట్లకు సూచించారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తులను సమర్పించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా భాగస్వాములు కావాలన్నారు.

**హామీల అమలులో కాంగ్రెస్ విఫలం..!**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై గిరిబాబు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసిందని ఆరోపించారు. ప్రస్తుత సాగు సీజన్‌లో రైతులకు అవసరమైన సమయంలో యూరియా కొరత సృష్టించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు గుమ్మడి వెంకటేశ్వర్లు, మద్దిశెట్టి ప్రకాష్, రామిశెట్టి వంశీ, రావుట్ల నరేష్ చారి, పోతిన్ని రాంబాబు, రామిశెట్టి వీరయ్య, బాదావత్ తావూరియా, నూతి శేషయ్య, గుమ్మడి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఇవిఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఆర్డిఓ కార్యాలయం ఆవరణలో ఉన్న ఇవిఎం గోదామును కలెక్టర్ అంకిత్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు భద్రతా ఏర్పాట్లను ప్రతీ నెలా క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే పరిశీలించినట్లు చెప్పారు. తనిఖీల్లో భాగంగా ఇవిఎంలు, వివిప్యాట్లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించడంతో పాటు సిసి కెమోరా నియంత్రణ గదిని సందర్శించి కెమోరాల పనితీరును రికార్డింగ్ వ్యవస్థను తనిఖీ చేశారు. గోదాము పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, భద్రతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అనుమతి లేని వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ గోదాములోనికి అనుమతించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. అనంతరం తనిఖీ రిజిష్టర్‌లో సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డిఓ మధు, ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ, ఎన్నికల సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# అరుణోదయ నాగన్న మృతి



**ప్రజాపక్షం/ఇల్లందు:** సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు, అరుణోదయ తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అరుణోదయ నాగన్న శుక్రవారం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతు కన్నుమూశారు. నాగన్న మృతి విప్లవోద్యమానికి తీరని లోటని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ(అశోక్ అన్న వర్గం)ఖమ్మం జిల్లా కమిటీ పేర్కొంది. ఆయన ఆశయాలు, ఉద్యమ స్ఫూర్తి ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తాయని నాయకులు నివాళులర్పించారు. ఖమ్మం డివిజన్ కమిటీ తరపున నాగన్నకు విప్లవ జోహార్లు అర్పిస్తూ, ఆయన ఆశయ సాధన కోసం ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు. ఈసందర్భంగా సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ ఖమ్మం జిల్లా నాయకుడు శివ నాయక సబ్ డివిజనన్ కార్యదర్శి తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# నాగన్న మృతి పట్ల న్యూడెమోక్రసీ సంతాపం



**ప్రజాపక్షం/కూసుమంచి:** అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పరకాల నాగన్న అకాల మరణంపై సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. పాలేరు డివిజన్ కార్యదర్శి బజ్జూరు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ నాగన్న తన గానంతో ప్రజల్లో చైతన్యం నింపుతూ రైతులు, కూలీల ఉద్యమాలకు అండగా నిలిచిన ప్రజా కళాకారుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. ఆయన మరణం ఉద్యమ ప్రపంచానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో ఐఎస్టియు ఖమ్మం జిల్లా కార్యదర్శి ఇరిగి ఎంకన్న, రైతు కూలీ సంఘం మండల నాయకులు మాతంగి రామస్వామి, చెరుకుపల్లి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి అధికారుల దీక్షలకు సిపిఐ ప్రజాసంఘాల సంపూర్ణ మద్దతు



**ప్రజాపక్షం/ఇల్లందు:** సింగరేణి అధికారుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం 30 జూన్ 2026 నుంచి కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు సిపిఐ పార్టీ అనుబంధ ప్రజాసంఘాల సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. శుక్రవారం ఇల్లందులోని దీక్షా శిబిరాన్ని సిపిఐ అనుబంధ తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం, ఇన్సాఫ్, డిహెచ్పీఎస్, ఇల్లందు ఏరియా కమిటీలు సందర్శించాయి. ఈసందర్భంగా ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్, టీజెఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుగులోత్ కృష్ణ, జిల్లా సమితి సభ్యుడు బానోత్ బాలాజీలు దీక్షలో పాల్గొన్న అధికారులకు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి అధికారులు పిఆర్‌సి బకాయిలు, పే ఆఫ్ అప్‌గ్రేడేషన్, ప్రమోషన్ పాలసీ అమలు, పే రివిజన్ స్కేల్ వంటి న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధికారుల పోరాటానికి సిపిఐ ప్రజాసంఘాల సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో తిలక్‌నగర్ ఉప సర్పంచ్ షేక్ ఖాసీం, వి విజయరాజ్, మంచాల వెంకటేశ్వర్లు, యాకూబ్ షా, విజయ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# 10న విద్యాసంస్థల బంద్



**ప్రజాపక్షం/టేకులపల్లి :** విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల పదిన రాష్ట్ర వ్యాపితంగా విద్యా సంస్థలను బంద్ చేయనున్నట్లు పిడిఎస్‌యు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు బి.వీరభద్రం పేర్కొన్నారు. శుక్రవారం ఈ మేరకు ప్రచారంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బంద్ గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కళాశాలల్లో వేలాది ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని, సరిపడా సిబ్బంది కూడా లేరని, మౌలిక వసతులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కూడా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల దోపిడి కొనసాగుతోందని ఆయన తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌కు అన్ని వర్గాల వారు సహకరించాలని ఆయన కోరారు.

# యూరియా బుకింగ్ యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/టేకులపల్లి :** యూరియా బుకింగ్ యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకుని ఎరువుల లభ్యత, నిల్వల వివరాలను తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. శుక్రవారం మండలంలో పర్యటించిన ఆయన బొమ్మనపల్లి పిఎసిఎస్ ఎరువుల గిడ్డంగులను తనిఖీ చేసి యూరియా, ఇతర ఎరువుల నిల్వలు, పంపిణీ వివరాలను పరిశీలించారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. తొమ్మిదోమైలు తండాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ (ఎస్ఐఆర్) పరిశీలించిన కలెక్టర్, అర్హులైన ప్రతి ఓటరును నమోదు చేసి ఎనిమిరేషన్ ఫారాల సేకరణను గడువు లోగా పూర్తి చేయాలని బిఎల్‌ఓలకు సూచించారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల పరిశుభ్రత, భోజన ఏర్పాట్లు, హాస్టల్ వసతులు, కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఆర్ఓ ప్లాంట్‌ను వెంటనే మరమ్మతు చేసి విద్యార్థినిలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదే



శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ వీరభద్రం, ఎంఈఓ జగన్, ఏఓ అన్నపూర్ణ, సంబంధిత శాఖల అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


# అధికారులతో సమీక్షించిన కలెక్టర్, సబ్ కలెక్టర్

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు లోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం కలెక్టర్ దివాకర్, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లు అధికారులతో శుక్రవారం పలు అంశాలపై సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వెజ్ నాన్ వెజ్ మార్కెట్ కల్లూరు, తల్లాడ మండలం లక్ష్మీ పురంలో భూ సమస్య, కాకర్లపల్లి టు బేతుపల్లి లో ఎన్ ఎస్ పి ల్యాండ్ , సత్తుపల్లి మండలంలో నీలాద్రి అర్బన్ పార్క్ , కల్లూరు మండలం పేరువంచలో పాఠశాల స్థలం పెండింగ్, కల్లూరు మున్సిపాలిటీ కార్మికులకు పెండింగ్ వేతనాలు, కల్లూరు గూడెం వేంసూరు మండలం మార్కెట్ కమిటీ గోడౌన్ , పిఎస్ పురం పెనుబల్లి మండలం, వేంసూరు మండలం కుంచపర్తి గ్రామంలో సమస్య, సత్తుపల్లి మండలంలో బేతుపల్లి రిజర్వాయర్ సమస్య ఎస్ ఆర్ ఎల్ ఐ పి మరియు ఇతర భూ సమస్యలపైకల్లూరు డివిజన్లో, వేశ్య కాంతుల చెరువు సత్తుపల్లి, మండలం వేంసూరు మండలంలో భూ సమస్యలు, తల్లాడ కేంద్రంలో అడ్వాన్స్ టెక్నాలజీ, కల్లూరు డివిజన్లో ఫారెస్ట్ మరియు రెవెన్యూ భూ సమస్యలు తదితర సమస్యలపై విపులంగా క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలు పరిష్కార దిశగా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహశీల్దార్‌లు, విద్యాశాఖ అధికారులు, రోడ్లు భవనాల శాఖ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు తదితర శాఖ అధికారులు తో సమీక్ష సమావేశం నిర్వహించారు.పైసమస్యలు పరిష్కారం దిశగా సమీక్షలు పూర్తిస్థాయిలో జరిగాయి.

# వైభవంగా శ్రీవారి ఆలయంలో మహాకుంభాభిషేకం



## - శృంగేరి శారద పీఠాధిపతి భారతిస్వామి ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ, ధ్వజ ప్రతిష్ట సహిత మహాకుంభాభిషేక కార్యక్రమాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శృంగేరి శారదా పీఠం శ్రీశ్రీ విధుశేఖర భారతీ స్వామి చేతుల మీదుగా అత్యంత వైభవంగా మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఉదయం7గంటలకు ప్రాత:కాల అర్చనలు, చతుర్వేద పారాయణలు, 9:30గంటలకు శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి, ఆలయ విమాన గోపురానికి శారదా పీఠం జగద్గురువులు శ్రీశ్రీశ్రీ భారతి తీర్థ స్వామి వారు కరకమల సజాతువులు, శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామి వారిచే మహా కుంబాభిషేకం, సంప్రోక్షణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణమంతా భక్తుల వెంకటేశ్వర నామస్మరణతో భక్తి పారవశ్యంతో నిండిపోయింది. అనంతరం సభావేదికపై భక్తులకు భక్తి ప్రవచనాలు తెలియజేశారు. విచ్చేసిన భక్తులకు శ్రీ వెంకటేశ్వర అన్నదాన సేవా కమిటీ అన్న ప్రసాదం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాదాయ శాఖ కమిషనర్ ఎం.వీరస్వామి, ఆలయ కార్యనిర్వాహణ అధికారి కొత్తూరు జగన్‌మోహన్ రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల విజయదేవ శర్మ, సర్పంచి తుళ్లూరు నిర్మల కుమారి, ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, వకుళ మాత స్టేడియం నిర్మాణదాత, ఖమ్మం కేఎన్‌ఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు, గ్రామస్తులు, భక్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు జామెట్రీ బాక్సుల బహూకరణ



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** శ్రీ భగవాన్ సత్యసాయి సేవా సమితి మధిర ఆధ్వర్యంలో జడ్‌పీహెచ్‌ఎస్ మడుపల్లి విద్యార్థులకు శుక్రవారం జామెట్రీ బాక్సుల బహూకరించి బిస్కెట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సమితి మధిర అధ్యక్షుడు కోన మోహన్‌రావు ముఖ్య అతిథిగా మాజరై మాట్లాడారు. విద్యార్థులు సర్వ్ ఆల్, లవ్ ఆల్ ధర్మాన్ని పాటించాలని, ఈర్ష్య, ద్వేషాలను విడనాడాలని, మంచిగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు వెంకట్రామి రెడ్డి, నాగేశ్వరరావు, సంతోశ్, ప్రధానోపాధ్యాయుడు తోట నర్సింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** ప్రభుత్వ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలో జార్జిరెడ్డి పీడీఎస్‌యూ, ఏఐఎస్ఏ, బీఎస్‌ఎఫ్ఐ, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో నిరసన, ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సంఘాల నాయకులు జమ్మి అశోక్, మంద సురేశ్, దాసరి రాజశేఖర్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో, వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, మౌళిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 'యంగ్ ఇండియా కిట్'ను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ తక్షణమే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి జార్జిరెడ్డి, బీఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాము, ఏఐఎస్ఏ నాయకులు నవీన్, గోపి, సాయి పాల్గొన్నారు.

# విబి జీ రాంజీ చట్టాన్ని రద్దు చేయాలి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విబి జీ రాంజీ చట్టాన్ని తక్షణమే ఉప సంహరించుకోవాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేతకు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. నవీన్‌రెడ్డి లు వారు మాట్లాడుతూ ఉపాధి పథకానికి సంబంధించి గతంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం వాటా నిధులు సమకూర్చేవన్నారు. విబి జీ రాంజీ చట్టం ద్వారా కేంద్ర ప్రభుత్వం తన వాటాని తగ్గించి రాష్ట్రాలపై 40 శాతం భారాన్ని మోపిందన్నారు. నిబంధనలు కూడా మార్చిందని దీని వల్ల గ్రామీణ పేదలకు ఉపాధి కోల్పోయే అవకాశం ఉందన్నారు. వెంటనే విబి జీ రాంజీ చట్టాన్ని ఉప సంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, పాపారావు, ఇమామ్, లాల్‌సాహెబ్, రఫీ, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు మైక్‌సెట్ వితరణ



**ప్రజాపక్షం/తల్లాడ :** మండల పరిధిలోని తెలగవరం ప్రాథమిక పాఠశాలకు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో మైక్ సెట్ వితరణ చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు నున్నా ప్రదీప్ కుమారుడు నున్నా సాత్విక్ (ఎన్ఆర్ఐ) వారి మాతృమూర్తి నున్నా సుజాత జ్ఞాపకార్థం రూ. 15వేలు విలువ గల మైక్‌సెట్‌ను పిఆర్‌పిఏ జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వరరావు, కాంప్లెక్స్ హెచ్ ఎం ఎ. రమేష్ చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేమిరెడ్డి అచ్చిరెడ్డికి శుక్రవారం అందజేశారు. నూతనంగా అడ్మిషన్లు చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల అవసర నిమిత్తం ఆర్థిక సాయం అందించిన నున్నా ప్రదీప్,నున్నా సాత్విక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాయల నర్సింహారావు, తల్లాడ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉంగరాల వెంకటేశ్వర్లు, అద్దంకి గోపాలకృష్ణ, సర్పంచ్ భూక్యా కాళోజీ, ఉప సర్పంచ్ సిలివేరు నర్సింహారావు, తూము నర్సింహారావు, ముదిగొండ తిరుపతిరావు, అనుమోలు రాఘవరావు, నేలపట్ల మహేష్ లు ఉన్నారు.

# సీతారామయ్యకు పువ్వాడ పరామర్శ



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు లాలాపురంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పర్యటించారు. దామా సీతారామయ్య ఇటీవల అనారోగ్యానికి గురై సర్జరీ చేయించుకున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. పువ్వాడ అజయ్‌కుమార్ వెంట ఆర్‌జెసి క్రిష్ణ, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కట్టా కృష్ణార్జునరావు, వనమా విశ్వేశ్వరరావు, పోట్ల శ్రీనివాసరావు, లకావత్ గిరిబాబు, పగడాల నాగరాజు, బాణాల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు చిలకా కోటయ్య, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, నాయకులు మద్దెల రవి, మాదినేని దుర్గాప్రసాద్, పాసంగులపాటి శివ, ఏదునూరి శ్రీనివాసరావు, సైద్‌పాషా, పాసంగుపాటి కోటేశ్వరరావు, నామ రాజేష్, నల్లబోలు వెంకటరెడ్డి, దామా హనుమంతరావు, మడిపల్లి కృష్ణ, నాని తదితరులు పాల్గొన్నారు.

# పల్లిపాడు పల్లె దవాఖానా పరిశీలన



**ప్రజాపక్షం/వైరాః** పల్లిపాడు పలె దవాఖానా ప్రారంభోత్సవం జరగనున్న నేపద్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ దవాఖానాను పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అవసరమైన మౌళిక సదుపాయాలు, త్రాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించి అవసరమైన ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రామచంద్రరావు, 16వ వార్డు కౌన్సిలర్ బలరామయ్య, మున్సిపల్ ఏఈ శ్రీమాన్య, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకట్రావు, సంబంధిత అధికారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# అఖిలపక్ష నాయకులతో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్




**ప్రజాపక్షం/వైరాః** వైరా రిజర్వాయర్ ఆయకట్టు సాగునీటి విడుదలపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అఖిలపక్ష పార్టీ అఖిలపక్షంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల అభిప్రాయాలు తీసుకున్న అనంతరం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, సుడా చైర్మన్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పది రోజుల్లో కాల్వలోని సిల్ట్ తీసి అనంతరం నీళ్లు వదిలేందుకు చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.